JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 09-08-2025
Medchal - Malkajgiri । Saturday 09-08-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 76 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 76 । Pages : 8 । ₹: 5

కన్నడనాటి యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది కథానాయిక రుక్మిణి వసంత్. కన్నడ అనువాద చిత్రం 'సప్తసాగరాలు దాటి' ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం ఈ భామ ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ సినిమాలో నాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా ప్రతిష్టాత్మక చిత్రం 'కాంతార చాప్టర్-1'లో రుక్మిణి వసంత్ కీలక పాత్రలో నటిస్తున్నది. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆమె ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె కనకావతి అనే పాత్రలో కనిస్తుందని, కథాగమనంలో ఈ పాత్ర ప్రధాన భూమిక పోషిస్తుందని మేకర్స్ తెలిపారు.





## రక్షాబంధన్‌కు ముందే మహిళలకు కేంద్ర బహుమతి

■ ఉజ్వల యోజనకు రూ.12,000 కోట్ల సబ్సిడీ

జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 8:

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (PMUY) కింద 202526 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో సబ్సిడీని ప్రకటించింది. శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రూ. 12,000 కోట్ల సబ్సిడీకి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న 10.33 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చనుంది. మహిళల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రకటన రక్షాబంధన్ పర్వదినానికి ముందు చేయడం విశేషం. PMUY కింద కేంద్రం చమురు మార్కెటింగ్ కంపెనీల (OMCs) ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడమే కాకుండా, ప్రతి రిఫిల్ పై కూడా సబ్సిడీ అందిస్తుంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు గుండ్లతో తిప్పే భారం నుండి విముక్తి పొందుతున్నారు. శుద్ధమైన ఇంధనం ద్వారా ఆరోగ్యానికి మేలు

...మిగతాది 2 లో

## మూసీ పునరుజ్జీవనం అవసరం



హైదరాబాద్‌లో ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదు. ఒక్కోసారి 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోంది. జూన్ నుంచి ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది. అందుకే వాతావరణ మార్పులు, భారీ వర్షా లతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థవంతంగా అనుసరించాలి.

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను అధిగమించటంతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే అభివృద్ధికి వీలుగా పనులు చేపట్టాలని చెప్పారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే.. అత్యవసరంగానే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని వివరించారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో ఇటీవలి వర్షాలు, తలెత్తిన ఇబ్బందులు, అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశంలో సమీక్షించారు. నగరంలో అత్యధికంగా 15 సెంటీమీటర్ల వర్షం కురవగా, ట్రాఫిక్ స్తంభించటంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వరద నీటితో ముంపు పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. సాధారణంగా మూడు నాలుగు నెలల్లో కురిసే వర్షపాతం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో నగరం అతలాకుతలమవుతోందని సమావేశంలో చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి గారు ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు ఆదేశాలిచ్చారు.

...మిగతాది 2 లో

## మేం ప్రూవ్ చేశాం..
## దొంగ ఓట్లతోనే బీజేపీ గెలిచింది

■ రాహుల్ గాంధీ



జయభేరి, న్యూఢిల్లీ:

ఎన్నికల సంఘం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఓటర్ జాబితా అవకతవకలతోనే 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని, ఈ విషయాన్ని మేం ప్రూవ్ చేశామని సంచలన ఆరోపణలు చేశారు. ఈసీ బీజేపీతో కుమ్మక్కైందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, ఈసీ అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఈసీ, బీజేపీ అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టామన్నారు. ఓట్ చోరీకి నిరసనగా కర్నాటక రాజధాని బెంగుళూరులో శుక్రవారం ఓట్ థెఫ్ట్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాహుల్

...మిగతాది 2 లో

## ట్రంప్ టారిఫ్‌లకు గట్టి షాకిచ్చిన భారత్..

■ రూ.31,500 కోట్ల భారీ ఒప్పందానికి మోదీ సర్కార్ బ్రేకులు



జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 8:

భారత ఎగుమతుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు రెండు దేశాల మధ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గురువారం (ఆగస్ట్ 7) నుంచి అమెరికాలోకి ఎగుమతి అయ్యే వస్తువులకు 25 శాతం టారిఫ్‌లు విధిస్తూ.. ట్రంప్ మొదట ఉత్తర్వులు జారీ చేయగా.. తాజాగా బుధవారం (ఆగస్ట్ 6) వీటికి అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించనున్నట్లు మరో బాంబ్ పేల్చారు. దీంతో మొత్తంగా భారత్‌పై అమెరికా 50 శాతం పన్నులు విధించినట్లయింది. మరోవైపు.. అమెరికా సుంకాల పెంపుతో దేశంలోని రాజకీయ పార్టీలతోపాటు, ఆర్థిక నిపుణుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా సుంకాలకు తలొగ్గేది లేదని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా నరేంద్ర మోదీ సర్కార్ సరికొత్త నిర్ణయం తీసుకుని.. అమెరికాతోపాటు డొనాల్డ్ ట్రంప్‌కు పెద్ద షాక్ ఇచ్చింది. భారత్‌పై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల

...మిగతాది 2 లో

## బీజేపీలో చేరనున్న ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే గులాబీ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు.. కారు దిగి అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయిన సంగతి తెలిసిందే. దీంతోపాటు గత బీఆర్ఎస్ 10 ఏళ్ల ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. కేసులు, సిట్‌లు, కమిషన్లు, విచారణలు, దర్యాప్తులు అంటూ ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దీనికితోడు బీజేపీ కూడా అటు బీఆర్ఎస్‌పై.. ఇటు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేస్తూనే ఉంది. ఇక ఇటీవల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. రేపు బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో ఎందులో చేరాలని తర్జన భర్జన పడిన గువ్వల బాలరాజు.. చివరికి కాషాయ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు.

ఈ నేపథ్యంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు త్వరలోనే కాషాయ తీర్థం పుచ్చుకోనున్నట్లు వివరించారు. అయితే ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు ఎవరు అనేది మాత్రం తెలంగాణ బీజేపీ చీఫ్ వెల్లడించలేదు. ఆ ఎమ్మెల్యేలు

...మిగతాది 2 లో

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక

■ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



జయభేరి, హైదరాబాద్ ఆగస్టు 8 :

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా లబ్ధిదారులను ఎంపిక చేశామని అన్నారు. ఏడేళ్ల క్రితం నిర్మించిన 592 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పొంగులేటి ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పామని, పేదల ముఖంలో నవ్వు చూడటమే లక్ష్యం అని తెలియజేశారు. గత ప్రభుత్వం రెండుపడకల గదులను పార్టీ కార్యకర్తలు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇచ్చిందని అన్నారు. మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గత ప్రభుత్వం పదేళ్లపాటు ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు.ఈ ప్రభుత్వం 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని కొనియాడారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులో భార్య పేరు, పిల్లల పేర్లు చేర్చే అవకాశం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లను జమచేశామని పొంగులేటి చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని, రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టిందని అన్నారు. బిసిలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వ చట్టం చేసిందని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని బిజెపి ఆమోదించలేదని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బిజెపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

## వైఎస్ విగ్రహాల మీద కోపమా



జయభేరి, విజయవాడ, ఆగస్టు 8:

నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వైసీపీపై ఉన్న రాజకీయ కోపాన్ని ప్రజానాయకుడు వైఎస్ఆర్ విగ్రహాలపై చూపించడం దారుణమని ఆమె విమర్శించారు."వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చివరి క్షణం వరకు ప్రజల కోసం తన ప్రాణాలను అర్పించారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి దిశానిర్దేశం చేశాయి. అలాంటి మహానేత పేరు పెట్టుకున్నంత మాత్రాన వైఎస్ఆర్... వైసీపీ సొంతం కాదు, పేటెంట్ హక్కు కాదు.

...మిగతాది 2 లో

## భారత్ పైనే ఎందుకు కోపం

2 లో

## అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.7 వేలు జమ చేసింది. అయితే, కొంతమందికి డబ్బులు చేరకపోవడంతో వ్యవసాయ శాఖ గ్రీవెన్స్‌లో 10,915 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. చాలా దరఖాస్తులు ఆమోదం పొందాయి, కొన్ని పరిశీలనలో ఉన్నాయి. ఎన్నికల నియమావళి, ఈకేవైసీ, ఎన్‌పీసీఐ సమస్యల వల్ల నిధులు పడలేదని అధికారులు తెలిపారు. అర్హులైన రైతుల ఖాతాల్లో త్వరలో డబ్బులు జమ కానున్నాయి.



■ మొత్తం 10,915 దరఖాస్తులు

■ అన్నదాత సుఖీభవ పథకం 2025

జయభేరి, విజయవాడ, ఆగస్టు 8:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ నెల 2న రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.7వేల చొప్పున డబ్బుల్ని జమ చేసిన సంగతి తెలిసిందే. కానీ కొందరు రైతులకు మాత్రం అకౌంట్‌లలో అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు జమకాలేదు.. ఈ మేరకు ప్రభుత్వం గ్రామ రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు ఇవ్వవచ్చని సూచించిన సంగతి తెలిసిందే. వ్యవసాయ శాఖ గ్రీవెన్స్‌లో ఈ నెల 3 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా 10,915 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అత్యధికంగా 1,290 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత విజయనగరం జిల్లా నుంచి 1,111 దరఖాస్తులు వచ్చాయి.. మిగిలిన 24 జిల్లాల నుంచి వెయ్యి లోపు దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 5,377 దరఖాస్తులను మండల వ్యవసాయ అధికారి పరిధిలో ఆమోదించారు. అయితే మరో 4,261 దరఖాస్తులు ఇంకా పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నారు. అయితే వీటిలో 29 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. అయితే తహసీల్దార్ పరిధిలో 411 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. ఇక 827 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు.. తహసీల్దార్ పరిధిలో 10 దరఖాస్తులను తిరస్కరించారు. త్వరలో గ్రీవెన్స్‌లో పరిష్కారమైన, అర్హులైన రైతుల ఖాతాల్లో నిధులు విడుదల కానున్నాయి. ఎన్నికల నియమావళి, ఈకేవైసీ సమస్యలు, ఎన్‌పీసీఐలో సమస్యలు ఉన్న రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు పడలేదని అధికారులు తెలిపారు. సుమారు లక్ష మంది రైతుల ఖాతాల్లో ఈ సమస్యలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ అందించిన డేటా ప్రకారం కేవలం 1,067 ఖాతాలకు మాత్రమే డబ్బులు బదిలీ కాలేదని ఆర్టీజీఎస్ ద్వారా సమాచారం అందిందని అధికారులు తెలిపారు. గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఫిర్యాదులు తీసుకుంటారని తెలిపారు. భూమి ఉన్న

...మిగతాది 2 లో

## అవే ఆరోపణలు.. మారని రాహుల్ తీరు



జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 8:

చింత చచ్చినా పులుపు చావదంటే ఇదే రాహుల్ జీ. ఎన్నికల్లో దశాబ్ధాల మీ పార్టీ కుంభకోణాలు చూసి.. విసిగి వేసారి జనాలు మోడీజీకి పట్టం కడితే ఆయన పాలనను మెచ్చి మూడు సార్లు గద్దెనెక్కిస్తే.. అమెరికా తొత్తుల మాయలోపడి.. ఫండింగ్ అనుసారం బీజేపీని ఎలా తొక్కేయాలో బాగానే ప్లాన్లు వేస్తున్నాడు మన ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. బీజేపీని ఎన్నికల్లో ఓడించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ కు ఎలాగూ లేదు. ప్రతిపక్ష

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మూసీ పునరుజ్జీవనం అవసరం

హైదరాబాద్‌లో ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదు. ఒక్కోసారి 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోంది. జూన్ నుంచి ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది. అందుకే వాతావరణ మార్పులు, భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థవంతంగా అనుసరించాలి. ఎంత వర్షం పడినా గ్రేటర్ హైదరాబాద్ సిటీలో వర్షపు నీటి నిల్వ ఉండకుండా, వరద నీటితో ముంపు గురవకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా అత్యంత పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలి. అందుకు వీలుగా రూపొందిస్తున్న మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలి. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉండటంతో పాటు లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురి కాకుండా ఉంటాయి. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నగరంలోని అన్ని వైపుల నుంచి వరద నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. నగరంలో ఉన్న హుస్సేన్‌సాగర్, దుర్గం చెరువు, మీర్ అలం చెరువులతో పాటు ప్రతీ చెరువు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలి. చెరువుల పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. కలుషితమైన నీటితో మూసీ పరివాహక ప్రాంతంలో రైతులు పంటలు పండిస్తున్నారని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా మూసీలో నిరంతరం శుద్ధి చేసిన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలి. భవిష్యత్‌లో వందేళ్ల పాటు మహానగరంలో వరద నీటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనం అవసరం. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రత మరింత పెరుగుతుండటంతో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాతనగరంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెడిస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు.

## బీజేపీలో చేరనున్న.. ఎమ్మెల్యేలు

ఎవరనేది త్వరలో చెబుతామని అన్నారు. వారు బీజేపీలో చేరే తేదీలతో సహా అన్ని వివరాలు వెల్లడిస్తామని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఇక బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరేది ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రమే కాదని.. రానున్న రోజులు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఆగస్ట్ 10వ తేదీ (ఆదివారం) రోజున అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కాషాయ పార్టీలో చేరనున్నట్లు వివరించారు. ఇది బీజేపీలో చేరికలకు తొలి అడుగు మాత్రమేనని.. ఇక నుంచి వలసలు పెరుగుతాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ముందు కాషాయ తీర్థం పుచ్చుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో హాట్ టాపిక్‌గా ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసుపైనా రాంచందర్ రావు స్పందించారు. ఈ కేసును సిట్ కాకుండా సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు ఎవరు అనేది బయటికి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో ఓడిపోతామనే భయంతోనే.. ముఖ్యమంత్రి ఎన్నికలు నిర్వహించడం లేదని ఎద్దేవా చేశారు. దేశంలో ఓటర్ల జాబితా వివరాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు.. ఆయన అసహనానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి బీసీల మీద కొత్తగా ప్రేమ వచ్చిందంటూ రాంచందర్ రావు వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు.

## మేం ప్రూవ్ చేశాం..

గాంధీ పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఓటర్ జాబితాలోని అవకతవకలను, అక్రమాలను మేం లేవనెత్తుతుంటే.. తప్పులు బయట పడొద్దని ఎన్నికల సంఘం తమ అధికారిక వెబ్ సైట్ క్లోజ్ చేసుకుంటుందని విమర్శించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఫలితాలు తారుమారు అయ్యాయి. ప్రిపోల్స్, ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ తప్పాయి. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించిన ఇండియా కూటమి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసింది. మహారాష్ట్ర లోక్ సభ, పార్లమెంట్ ఎన్నికల మధ్య గ్యాప్ కేవలం నాలుగు నెలలు మాత్రమే. ఈ నాలుగు నెలల వ్యవధిలోనే కొత్తగా కోటీ ఓటర్లు నమోదు అయ్యారు. నిశితంగా పరిశీలిస్తే ఇవన్నీ ఫేక్, బోగస్ ఓట్లని తేలింది. ఇలా ఎన్నికల్లో అక్రమాలు చేసి బీజేపీ విజయం సాధించిందని తెలిపారు రాహుల్ గాంధీ. కర్నాటక లోక్ సభ ఎన్నికల్లో కూడా అవకతవకలు జరిగాయని.. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో 1.50 వేల ఫేక్ ఓట్లు చేర్పించారని ఆరోపించారు. ఒక సింగల్ బెడ్ రూమ్ ఇంట్లోనే 40 మందికి పైగా ఓటర్లు ఉన్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. కాషాయ పార్టీ భావజాలం భారత రాజ్యాంగానికి విరుద్ధమని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు కార్యకర్త రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు.

## రక్షాబంధన్‌కు ముందే..

కలుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో, OMCsకి రూ. 30,000 కోట్ల ఎల్పీజీ సబ్సిడీని కూడా కేంద్రం మంజూరు చేసింది. గ్యాస్ ధరల పెరుగుదల వల్ల తక్కువ ఆదాయ గల కుటుంబాలపై భారం పడకుండా ఉండేందుకు ఈ విధంగా ఆర్థిక భరోసా అందించనున్నారు. ఈ సబ్సిడీ వల్ల కంపెనీలకు నష్టాలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ కీలక నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం మీడియాతో వెల్లడించారు. మహిళా శక్తిని ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఉజ్వల యోజన లాంటి పథకాలు మహిళల జీవితాల్లో నాణ్యతను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు.

## అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్

కొందరికి రైతు భరోసా డబ్బులు అందడం లేదు. భూ యజమాని చనిపోతే, వారి పేరు జాబితా నుంచి తీసేశారు. వారసులకు ఇంకా పాసుపుస్తకాలు ఇవ్వలేదు. ఆధార్ అనుసంధానంలో తప్పులు జరిగాయి. తహసీల్దార్లకు పంపినా సమస్య పరిష్కారం కాలేదు. న్యాయపరమైన సమస్యలు ఉన్న భూములను, వెబ్‌ల్యాండ్‌లో నోషనల్ ఖాతాలుగా నమోదైన వాటిని తిరస్కరించారు. ఆక్వా సాగు, వ్యవసాయేతర అవసరాలకు వాడే భూములకు ఈ పథకం వర్తించదు. అలాగే నెలకు రూ.20 వేల కంటే ఎక్కువ జీతం పొందే ఉద్యోగులు.. ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు కూడా అనర్హులు. 10 సెంట్ల కంటే తక్కువ భూమి ఉన్నవారు.. మైనర్లు కూడా ఈ పథకానికి అనర్హులు. EKYC చేయని వారికి కూడా డబ్బులు అందలేదు. ఎన్‌పీసీఐలో ఖాతా పని చేయకపోతే లేదా మ్యాప్ కాకపోతే బ్యాంకుకు వెళ్ళి వెంటనే యాక్టివ్ చేసుకోవాలి. ఈకేవైసీ పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేసుకోవాలి. అప్పుడు అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం అందుతుంది. అన్నదాత సుఖీభవకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సాయం అందుతుందని ప్రభుత్వం చెబుతోంది.

## వైఎస్ విగ్రహాల మీద కోపమా

తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడి విగ్రహాలను కూల్చడం ఎక్కడి దిక్కుమాలిన చర్య?" అని షర్మిల ప్రశ్నించారు. నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ వైసీపీ ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించడంపై తమకు అభ్యంతరం లేదని, కానీ అదే సాకుతో విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమని ఆమె స్పష్టం చేశారు. "మహానేత మరణం తర్వాత నాటి ప్రభుత్వం గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. ఇప్పుడు ఆ విగ్రహాన్ని తొలగించడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం" అని ఆమె వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ విగ్రహాలను కూల్చడం ద్వారా ప్రజాభిమానాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశం స్పష్టమవుతోందని షర్మిల విమర్శించారు. "వైసీపీకి వైఎస్ఆర్ విగ్రహాలకు సంబంధం లేదు. ఆ విగ్రహాలను కూల్చడం ద్వారా ప్రజల మనోభావాలను అవమానపరుస్తున్నారు. తొలగించిన చోట వెంటనే రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి. లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నాం" అని ఆమె హితవు పలికారు.

# భారత్ పైనే ఎందుకు కోపం

**అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. దీంతో ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలతో కలిపి మొత్తం సుంకాలు 50 శాతం కానున్నాయి. అదనపు సుంకాలకు ఆదేశాలిస్తూ, ''భారత ప్రభుత్వం ఇప్పటికీ రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది''అని వైట్‌హౌస్ పేర్కొంది. అందుకే అదనపు సుంకాలు విధించినట్లు తెలిపింది.**




ఈ అదనపు సుంకాలు ఆగస్ట్ 27 నుంచి అమల్లోకి వస్తాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లలో భారత్ కంటే చైనా ముందున్నప్పటికీ, ప్రత్యేకంగా భారత్‌నే అమెరికా ఎందుకు లక్ష్యం చేసుకుందనేదే ఇక్కడి ప్రశ్న. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహానికి ఇతర అనేక కారణాలున్నాయని నిపుణులు భావిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సమూహం బ్రిక్స్. ఇందులో భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇరాన్, ఇథియోపియా, ఇండోనేషియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భాగస్వాములుగా ఉన్నాయి. ఈ దేశాలన్నీ డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. అది అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మింగుడుపడడం లేదు. బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామంటూ ఎప్పటికప్పుడు బెదిరిస్తూ వస్తున్నారు. బ్రిక్స్ దేశాలు తమ సొంత కరెన్సీని తీసుకొస్తే, అమెరికాతో వాణిజ్యానికి వీడ్కోలు పలికేందుకు కూడా సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించిన నాటి నుంచి చమురును రూబుల్స్(రష్యన్ కరెన్సీ)లో చైనా కొనుగోలు చేస్తోంది . యూఎస్ కాంగ్రెషనల్ రీసర్చ్ సర్వీస్ ప్రకారం, 2022లో అంతర్జాతీయ వాణిజ్యంలో దాదాపు సగభాగం అమెరికన్ డాలర్లలోనే జరిగింది. డాలర్ ద్వారానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ జియోపాలిటిక్స్ ప్రొఫెసర్ ఫైసల్ అహ్మద్, బ్రిక్స్ అంతకంతకూ విస్తరిస్తోందని భావిస్తున్నారు. ఇప్పుడు ఇరాన్ కూడా ఇందులో భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ దేశాల మధ్య స్థానిక కరెన్సీ గురించి చర్చ జరుగుతోంది. దాని గురించే అమెరికా భయపడుతోంది. వీళ్లు బలంగా ఉంటే డాలర్ బలహీనమవుతుంది. మరిన్ని సుంకాలు విధిస్తే, ఆర్థిక వ్యవస్థకు హాని కలుగుతుంది. అప్పుడు అమెరికా ఆధిపత్యం అలాగే కొనసాగుతుంది'' అని ఆయన అన్నారు. మరోవైపు, థింక్ ట్యాంక్ అయిన గేట్‌వే హౌస్‌లో ఫెలోగా ఉన్న నైనిమా బసు ''బ్రిక్స్‌లోని ఇతర దేశాలు చాలా మార్పులు తీసుకురావాలనుకుంటున్నాయి, కానీ భారత్ అలసత్వ వైఖరి కారణంగా వారు అలా చేయలేకపోతున్నారు. అమెరికాతో సంబంధాల కారణంగా భారత్ బ్రిక్స్‌ను బలహీనపరుస్తోందని పదేపదే ఆరోపణలు ఎదుర్కొంటోంది'' అన్నారు. ''అమెరికాపై కేవలం భారత్ ఒక్కటే కాదు, ఇతర బ్రిక్స్ దేశాలు కూడా ఆధారపడ్డాయి. అయినా, అమెరికా నుంచి భారత్ ఇలాంటి సుంకాలను ఎదుర్కొంటోంది'' అని తెలిపారు.

అమెరికా చాలా ఏళ్లుగా భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ మొదటి పదవీకాలంలోనూ ఈ ప్రయత్నాలు జరిగాయి, కానీ ఫలించలేదు. వాణిజ్య ఒప్పందం అమెరికాకు భారత మార్కెట్లను తెరుస్తుందని ట్రంప్ విశ్వసిస్తున్నారు, కానీ కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. భారత్, అమెరికా మధ్య వ్యవసాయ వాణిజ్యం దాదాపు 8 బిలియన్ డాలర్లు (అంటే సుమారు 70 వేల కోట్ల రూపాయలు). భారత్ బియ్యం, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేస్తుంది. అమెరికా నుంచి డ్రైఫ్రూట్స్, యాపిల్స్, పప్పుధాన్యాలను దిగుమతి చేసుకుంటోంది. అమెరికాకు రాయితీలు కల్పిస్తే, ఇప్పుడున్న మాదిరిగా ఎం.ఎస్.పీ (కనీస మద్దతు ధర)కు రైతుల వద్ద నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయలేమని, ఇది దేశంలో పెద్ద సమస్యగా మారొచ్చని నిపుణులు భావిస్తున్నారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్ట్ 31 నుంచి సెప్టెంబర్ 1 వరకూ ఈ పర్యటన జరగనుంది. గతేడాది అక్టోబర్‌లో, రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ అయ్యారు. 2025 జూన్‌లో, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా బీజింగ్‌లో పర్యటించారు. ఆ తర్వాత విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్ కూడా చైనా వెళ్లారు. భారత్, చైనా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని జామియా మిలియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ రేష్మీ కాజీ అన్నారు. ''ఏదైనా దేశం అమెరికాను సవాల్ చేస్తోందంటే, అది చైనానే. ఒకప్పుడు ఈ ప్లేస్‌లో రష్యా ఉండేది. కానీ ఇప్పుడు చైనాతోనే అమెరికాకు అతిపెద్ద ముప్పు. చైనాను ఎదుర్కోవాలంటే అమెరికాకు భారత్ అవసరం.'''' భారత్, చైనా మధ్య కైలాష్ మానసరోవర్ యాత్ర మళ్లీ మొదలైంది. ప్రధాని మోదీ చైనా పర్యటన తర్వాత, బీజింగ్ దిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీస్ కూడా ప్రారంభం కావొచ్చని అనుకుంటున్నా. చైనా ఎప్పటి నుంచో ఇది కోరుతోంది. రానున్న రోజుల్లో వీసా పరిమితులను కూడా ఎత్తేయచ్చు'' అని నైనిమా బసు అన్నారు. 'ఇదంతా అమెరికాకు మింగుడుపడడం లేదు, రష్యా నుంచి చమురు కొంటున్నారంటూ సాకులు చెబుతోంది. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపేస్తే భారత్‌పై అమెరికా సుంకాలు విధించదా?'' అని ఆమె ప్రశ్నించారు. 'ప్రధాని మోదీ అమెరికా వెళ్లిన సమయంలో, ట్రంప్ భారత్‌ను టారిఫ్ కింగ్ అని సంబోధించారు. అందువల్ల సుంకాలు విధింపును నిలువరించడం కష్టం. అయితే, దానిని కనీసం పరిమితుల్లోపు ఉంచొచ్చు'' అని ఆమె అన్నారు. భారత్ విషయంలో ఈసారి ట్రంప్ కఠినంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. గత పదవీ కాలంలో కాస్త మృదువుగా వ్యవహరించినట్లు కనిపించారు. భారత్, పాక్ మధ్యన తన వల్లే కాల్పుల విరమణ జరిగినట్లు ట్రంప్ పదేపదే చెప్పుకుంటున్నారు, అయితే భారత్ మాత్రం కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని స్పష్టం చేసింది. ''ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధాని మోదీ తనకు కొంత క్రెడిట్ ఇవ్వాలని, లేదంటే కనీసం ఒక ఫోన్ కాల్ అయినా చేయాలని ట్రంప్ కోరుకున్నారు. కానీ, అది జరగలేదు. ఇది ట్రంప్ ఆగ్రహానికి కారణంగా తెలుస్తోంది'' అని బసు అన్నారు. నాన్ టారిఫ్ నిబంధనలపై అమెరికా చాలా కాలంగా తన అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. భారత్‌పై ట్రంప్ అసంతృప్తికి ఇదో పెద్దకారణం. ప్రతి దేశం నాన్ టారిఫులు విధిస్తున్నప్పటికీ , అమెరికా అందులోనూ మినహాయింపు కోరుకుంటోంది.'''' భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. అమెరికా అభివృద్ధి చెందిన దేశం. అందువల్ల రెండు దేశాలనూ ఒకేలా చూడలేం. దేశీయంగా ఉత్పత్తిని ప్రోత్సహించడంపై భారత్ దృష్టి పెట్టింది'' అని ఫైసల్ అహ్మద్ విశ్లేషించారు.

> **''ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధాని మోదీ తనకు కొంత క్రెడిట్ ఇవ్వాలని, లేదంటే కనీసం ఒక ఫోన్ కాల్ అయినా చేయాలని ట్రంప్ కోరుకున్నారు. కానీ, అది జరగలేదు. ఇది ట్రంప్ ఆగ్రహానికి కారణంగా తెలుస్తోంది'' అని బసు అన్నారు.**



## ట్రంప్ టారిఫ్‌లకు గట్టి షాకిచ్చిన భారత్..

నేపథ్యంలో అమెరికాతో జరిగిన బోయింగ్ విమానాల కొనుగోలు డీల్‌ను కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఆపేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. 6 బోయింగ్ బీ8ఐ (Boeing P8I) మారిటైమ్ పెట్రోల్ విమానాలు కొనుగోలు చేసేందుకు 3.6 బిలియన్ డాలర్లు అంటే మన భారత కరెన్సీలో ఏకంగా రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందం ఇప్పుడు రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందానికి 2021లోనే అమెరికా విదేశాంగ శాఖ ఆమోద ముద్ర వేసింది. అయితే సప్లై చైన్‌లో అంతరాయాలు ఏర్పడటం.. ద్రవ్యోల్బణం, తాజాగా భారత ఎగుమతులపై ట్రంప్ విధించిన సుంకాలు నేపథ్యంలో విమానాల ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. రక్షణ శాఖ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ప్రాజెక్ట్ వ్యయం దాదాపు 50 శాతం పెరగడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు, విమానాలను తయారు చేసేందుకు కావాల్సిన స్పేర్ పార్ట్స్, టూల్స్ ధరలను భారీగా పెంచేశాయి. ఈ అదనపు వ్యయాన్ని బోయింగ్ సంస్థ, వాటిని కొనుగోలు చేసే భారత ప్రభుత్వంపై వేయడంతో ఈ బోయింగ్ విమానాల కొనుగోలు ఒప్పంద వ్యయం భారీగా పెరిగిపోయింది. భారీగా పెరిగిన ధరలకు తోడు అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు మారడం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న రక్షణ మంత్రిత్వ శాఖ ఈ డీల్‌ను రద్దు చేసి.. దాన్ని మళ్లీ పరిశీలించాలని నిర్ణయించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే ఈ విమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన వివరాలు గానీ.. దాన్ని రద్దు చేయడం గురించి గానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు.. ప్రస్తుతం భారత్, అమెరికా మధ్య సుంకాల వివాదం కొనసాగుతుండగానే.. ఎయిర్ ఇండియా సంస్థ.. తన పాత బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ విమానాలను ఆధునీకరించడానికి అమెరికాకు పంపించడం మొదలుపెట్టింది. ఈ ఏడాది చివరి నాటికి.. ఇందులోని తొలి విమానం తిరిగి భారత్‌కు చేరనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎయిరిండియా వద్ద మొత్తం 33 డ్రీమ్‌లైనర్ విమానాలు ఉండగా.. ఆధునికీకరణ తర్వాత అందులో 20 బిజినెస్ క్లాస్ సీట్లు, 25 ప్రీమియం ఎకానమీ సీట్లతోపాటు ఎకానమీలో 205 సీట్లు ఉంటాయని ఎయిరిండియా తెలిపింది.

## అవే ఆరోపణలు.. మారని రాహుల్ తీరు

పార్టీలకు వచ్చినన్నీ ఓట్లు, సీట్లు కూడా కాంగ్రెస్ కు రాలేదు. దీంతో ఏం చేయాలో పాలుపోక ఇప్పుడు ఇక మహారాష్ట్రలో, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటే పాడిందే పాడరా పాసుపండ్ల దాస అన్నట్టుగా వల్లెవేశారు. దానికి సరైన ఆధారాలు చూపించడం లేదని బీజేపీ వాదులు మండిపడుతున్నారు. కొన్ని ఓట్లు చూపిస్తే గోల్ మాల్ అవుతుందా? ఇంత పెద్ద దేశంలో కొన్ని ఓట్లను ఎలా ప్రమాణికంగా తీసుకుంటారని బీజేపీ వాదులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఢిల్లీ ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు వింటుంటే కామెడీ బాగా చేశారనిపిస్తోంది.. ఎన్నికల అనంతరం ఓట్ల చోరీ, నకిలీ ఓటర్లు, దళారీ వ్యవస్థలు అంటూ ప్రతిసారి ఓటమిని ధ్వంసపరిచేందుకు ఆయన చేసే ప్రయత్నం కొత్తేమీ కాదు. కానీ ప్రజలు మాత్రం ఇదే కథకు ఏడాదికేడాది విసుగుతో కూడిన వ్యతిరేకతను వ్యక్తపరిచారు. రాహుల్ చెప్పింది నిజంగా నిజం అయితే.. తెలంగాణలో , కర్ణాటకలో కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది. ఇక్కడ కూడా బీజేపీ ఓట్ల గోల్ మాల్ చేసి గెలవొచ్చు కదా.. ఈ పాయింట్ ను రాహుల్ ఎందుకు ప్రస్తావించడం లేదన్నది బీజేపీ వాదుల ప్రశ్న. ఓటమికి అసలు కారణం తమ పక్షంలో లేదని రుజువు చేయాలనేలా రాహుల్ ఆరోపణలు చేస్తూ మళ్లీ బీజేపీపై తప్పుడు విమర్శలు గుప్పిస్తున్నారు. “ఆటంబాంబు లాంటి ఆధారాలు” తమ వద్ద ఉన్నాయట! ఆ బాంబ్ ఎప్పుడు పేలుతుందో తెలీదు కానీ, కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా రోజుకో మాయబాంబ్ పేలుస్తూ ప్రజల మనస్సుల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుంది. అయితే ఇప్పటి ప్రజలు మాత్రం అవే పాత స్టోరీలు వినేంత అమాయకులు కాకపోవడం గమనార్హం. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించినా తన వద్ద ఉన్నటువంటి ఆధారాలను ఎప్పటికీ ప్రజల ముందు ఉంచలేరు. ఎన్నికల సంఘాన్ని హెచ్చరించడమో, అధికారులను బెదిరించడమో కాంగ్రెస్‌కు పరిష్కార మార్గంగా మారిపోయింది. కానీ ప్రజలు మాత్రం ఈ ఆరోపణలపై ఏ మాత్రం విశ్వాసం పెట్టడంలేదు. ఇదే మోడీజీని మూడుసార్లు ప్రధానిగా గద్దెనెక్కించిన దేశ ప్రజల తీర్పు. కాంగ్రెస్, రాహుల్ గాంధీకి ఓట్లు వేయకుండా మోడీ పాలనపై ప్రజల విశ్వాసాన్ని మరోసారి ధృవీకరించారు. నిజాయితీ, దేశభక్తి, అభివృద్ధి అజెండాతో ముందుకు సాగుతున్న నాయకుడు నరేంద్ర మోడీకి తిరుగు లేదని సమీక్షలో స్పష్టమైంది. ఓటమి వచ్చినప్పుడల్లా ఎన్నికల వ్యవస్థను నిందించడం, ఈసీపై శంకలు వేయడం ఒక రాజకీయ పాత అలవాటు అయ్యిందని ప్రజలు గుర్తించారు. ఇది నాయకత్వ లోపాన్ని దాచేందుకు చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. మొత్తంగా చెప్పాలంటే ప్రజలు ఇప్పుడు ఓటు వేస్తున్నారు వ్యక్తిత్వానికి, నేతల మౌలిక విలువలకు. దానికి వ్యతిరేకంగా కేవలం ఆరోపణలతో రాజకీయం చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి మేలు జరగదు. పరిణతి, ప్రత్యామ్నాయ ఆలోచనలతో ప్రజల మధ్యకు వచ్చి విశ్వాసాన్ని గెలుచుకోలేకపోతే.. ఓటమి తర్వాత బీజేపీపై, ఎన్నికల సంఘంపైనే తప్పుడు విమర్శలు చేయడం రాహుల్ గాంధీకి శాశ్వతంగా అంటుకున్న అలవాటుగా మారిపోయింది. ఈ కాకమ్మ కథలు ఎన్నిరోజులైనా ప్రజలు ఇక నమ్మే రోజులు పోయాయి రాహుల్ గాంధీ గారు.. ఎందుకంటే వారు ఓట్లు వేసి నమ్మింది మోడీని.. ఆయన్ను ఓడించే దమ్ములేని రాహుల్ ఇలా ఓట్ల గోల్ మాల్ అంటూ ఎంత రచ్చ చేసినా బీజేపీపై, మోడీపై దేశ ప్రజల విశ్వాసం అస్సలు చెక్కు చెదరదు.

# బీసీలను మోసం చేస్తున్న బిజెపి

- బీజేపీ తీరుపై బీసీ జేఏసీ నేతల ఆగ్రహం
- బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించడానికి పార్లమెంట్ లో చట్టం చేయాలనీ డిమాండ్!

జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 08 :



బిజెపి పై మండిపడ్డ జేఏసీ నాయకులు. సమాజంలో 56% పైగా ఉన్న బీసీలు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో బీసీలకు దక్కిన వాటా చాలా తక్కువగా ఉందని అన్నారు. రాజకీయంగా బిసిల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనేటట్లు ఉండి మారుతున్న రాజకీయ కారణాలవల్ల కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో 42 శాతం బీసీలకు జనాభా ప్రకారం కాకుండా విద్యా ఉద్యోగ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పింది. దానికి అనుగుణంగానే రాష్ట్ర అసెంబ్లీలో 42 శాతం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపింది ఈ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి పార్లమెంటులో బిల్లును పెట్టి పాస్ చేయాలని చెప్పింది ఇక్కడ ఉన్నటువంటి బిజెపి నాయకులు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేటప్పుడు చప్పుడు చేయకుండా ఒప్పుకొని పార్లమెంట్లో బిల్లు పెట్టి పాస్ చేయాల్సిన సమయంలో 42 శాతంలో ముస్లింలకు 10% పోతాయి అని వితండ వాదాన్ని ముందుకు తీసుకొచ్చి బిల్లు పాస్ కాకుండా చేస్తున్నారని ఈ వంకతో బీజేపీ బీసీలకు మోసం చేస్తుందనీ బీజేపీ పార్టీ బండి సంజయ్ కిషన్ రెడ్డి రామచంద్ర రావులు వాళ్ళ అసలు రూపాన్ని బీసీ వ్యతిరేకతను చెప్పకనే చెబుతున్నారని కొన్ని ముస్లిం కులాలు మైనార్టీ కులాలను బీసీలుగా గుర్తించి మీరు పాలిస్తున్న గుజరాత్ రాజస్థాన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో రిజర్వేషన్లు ఇస్తున్నారు కదా అంటే దానికి సమాధానం లేదని బిజెపి ద్వంద వైఖరిని అవలంబిస్తుందని ఈ వైఖరిని బిజెపి ఎన్డీఏ కూటమి పార్టీలు బీసీ బిల్లులు పార్లమెంటులో పెట్టి చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం 6% కూడా లేని ఓసీలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని బీజేపీ పార్టీ తీరుపై బీసీ జేఏసీ నేతలు మండిపడ్డారు. ఈ సమావేశంలో టీజీ.శ్రీనివాస్, కర్ణకోట రవీంద్రనాథ్, కరుణాకర్, నక్క బాలరాజ్ ,నర్సింలు గౌడ్, యాదగిరి, శ్రీధర్, ఎల్లోజి , ప్రజా సంఘాల నాయకులు బిజిలి సత్యం, తిరుమలయ్య ,తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 08 :

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మూడు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో జరిగినది .వివరాల్లోకి వెళితే తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన పర్వతం రాజు రోజూ మాదిరిగానే ద్విచక్ర వాహనంపై గ్రామం నుండి యాడారం తుర్కపల్లి కి కంపెనీకి పని నిమిత్తం వెళ్తున్న తరుణంలో కొల్తూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు .రాజు మృతి చెందడంతో వాసాలమర్రి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ

- దేవరకొండ నియోజకవర్గ సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు



జయభేరి, దేవరకొండ :

ప్రేమానురాగాలకు రాఖీ పౌర్ణమి ప్రతీక అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ సోదరసోదరీమణులకు రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షా బంధన్ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నాదమ్ముల్లకు అనురాగంతో చేతికి రక్షా బంధనాన్ని కట్టడం గొప్ప సందర్భం అని ఆయన తెలిపారు. రక్షాబంధన్ సాంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని, ప్రజల్లో సహోదరత్వాన్ని మరింతగా పెంపొందిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రేమనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను నియోజకవర్గ ప్రజలంతా ఆనందోత్సాహల్లో జరుపుకోవాలని ఆయన కోరారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

జయభేరి, శ్రీకాళహస్తి, ఆగస్టు 8:

వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమికి ముందు రోజును వరలక్ష్మీ వ్రతం గా భావించి పండుగ చేసుకోవడం ఆనవాయితీ. శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఆవరణలో ఉన్న బ్రహ్మ గుడి వద్ద శాస్త్రోక్తంగా వరలక్ష్మి వ్రత మాచరించారు. 2,000 మంది పైగా మహిళలు వ్రత పూజల్లో పాల్గొన్నారు లక్ష్మి దేవి మూర్తిని ఏర్పాటు చేసి పూలు ఆభరణాలతో చక్కగా అలంకరించి వేద పండితులు పూజలు చేశారు పట్టణంలోని మహిళలే కాకుండా సమీప గ్రామాల్లోని వారు కూడా వ్రతంలో పాల్గొన్నారు. వరలక్ష్మి దేవికి శాస్త్రోక్తంగా అర్చకులు పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి,ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

# మమతకి ముడిచేసే పండుగ

**మన భారతీయ సంస్కృతిలో బంధాలు కన్న బంధాలు ఎక్కువగా ఉండే మనిషి జీవితాన్ని మాధుర్యంతో నింపేవి. అలాంటి అనుబంధాల్లో రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజు వచ్చే ఈ పర్వదినం, అన్నాచెల్లెలు మధ్య గల ప్రేమ, అపారమైన అనుబంధాన్ని చాటుతుంది. రక్తసంబంధమైతే ఒకదాన్ని మరొకదానికి బంధిస్తే, మనసుతో ఏర్పడే అనుబంధం మనిషిని జీవితాంతం బంధించి ఉంచుతుంది. ఆ బంధానికి ప్రతీకే రాఖీ.**



రాఖీ అంటే కేవలం ముడి కాదు... అది అక్కాచెల్లెళ్ల ప్రేమకు గుర్తు. చెల్లెలు అన్న చేతికి రాఖీ కట్టడమే కాకుండా, ఆ అనుబంధాన్ని గాఢతరం చేసే మధుర క్షణాల సమాహారం. ఈ రోజు ఆమె ఆత్మీయతతో అన్నకి కట్టే రక్షాబంధనం, అన్నకు ఓ బాధ్యతను గుర్తుచేస్తుంది. "ఈ చెల్లెలు బంగారమే, ఈమె కోసం నేను ఉన్నాను" అనే తపన. అలాగే చెల్లెలికి కూడా ఇది ఒక భద్రతా సంకేతం... "నా కోసం ఎప్పుడూ నా అన్న ఉన్నాడు" అనే నమ్మకం. ఈ పండుగ మానవ జీవితంలోని మన్నించని స్నేహానుబంధాల సంబరానికి మారుపేరుగా నిలుస్తుంది. రక్త సంబంధాలకన్నా, ఆత్మ సంబంధాలే గొప్పవని చెబుతుంది. మన సంస్కృతిలో రాముడుశబరీ, కృష్ణుడుద్రౌపది మధ్య ఉన్న ఆత్మ బంధమే ఈ పండుగకు మూలమైన తాత్పర్యాన్ని అందించింది.

రాఖీ పండుగలో భాగంగా అన్న, తమ్ముడు, అక్క, చెల్లెళ్లంతా ఒకే చోట చేరి ఆనందంగా సమయాన్ని గడపడం అనేది కుటుంబ అనుబంధాల పునర్నిర్మాణానికి ఒక పునాది. జీవిత భారం, ఉద్యోగ ఒత్తిళ్ళ మధ్య ఎన్నాళ్లైనా దూరంగా ఉన్నా... ఈ ఒక రోజు మాత్రం అన్నాచెల్లెళ్ళ మధ్య మమతా హారిణి నవ్వుతుంది. తమ్ముడి చేతికి అక్క వేసే రాఖీలో ఆమె కష్టాలు, ఆశలు, భద్రత కోరుకునే ఆకాంక్షలు అగుపిస్తాయి.

ఈ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదు... అది బంధాలను గుర్తుచేసే ఋతువు, మనుషుల మధ్య ఉన్న సంబంధాలనెరుగజేసే సంబర సందర్భం. కాలం మారినా, కాలబాధ్యతలు పెరిగినా... రాఖీ పండుగ ఒక మానవీయ మాధుర్యంగా నిలిచి ఉంటుంది. ఈ సందర్భం మనకు చెబుతుంది - మనం ఏ స్థితిలో ఉన్నా, మన బంధాలు మనిషిని విలువైనవాడిని చేస్తాయనీ, ఒక్క చిన్న ముడి జీవితాన్ని ఎంత మలుపుతిప్పగలదో ఈ పండుగలో స్పష్టమవుతుంది. ఈ రోజున ప్రతి తమ్ముడు తన అక్కకు, చెల్లెలికి ఒక మాట ఇవ్వాలి... "నీ జీవితానికంతటానికీ నేను ఓ నీడలా నిలబడతాను." ప్రతి అక్కా, చెల్లెలూ ఒక ఆశపాట పాటించాలి... "నా అన్న ప్రేమకు ప్రతిఫలం ఇవ్వగలనంటే అది నా నమ్మకం." అంతిమంగా చెప్పాలంటే, రాఖీ పండుగ అనేది ఒక మనసుల ముడి, రక్తంతో కాకపోయినా ప్రేమతో ముడిపడిన జీవిత అనుబంధం. ఇది ఒక ఉదాత్తమైన కుటుంబ ధర్మాన్ని, మనుషుల మధ్య ఉండాల్సిన ఓ శాశ్వతమైన విలువను గుర్తు చేస్తుంది. ఈ శ్రావణ పౌర్ణమి రాఖీ పండుగ ప్రతి మనిషికి మానవీయతను, మమతను, మౌనంగా పంచుకునే ఆనందాన్ని అందించాలి. అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరుకుందాం. మనం ఉన్నచోట ఈ అనుబంధాల వెలుగు కాంతిగా పీల్చుకుంటూ జీవించాలి.



డా. చిటికెన కిరణ్ కుమార్
ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు
ఐ బి ఆర్ ఎఫ్ సభ్యులు
సెల్: 9490841284

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఒక మార్పు - అభివృద్ధికి మలుపు - స్వచ్ఛతకై తొలి అడుగు
- మున్సిపల్ కమిషనర్ సుదర్శన్

జయభేరి, దేవరకొండ :



100 రోజుల ప్రణాళిక లో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు, వివిధ విభాగాల సిబ్బందికి బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం చేత మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఆరోగ్యం, పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించారు. తదనంతరం బి.పి, షుగర్, హిమోగ్లోబిన్, రక్త పరీక్షలు నిర్వహించి Dr.విజయ సూచన మేరకు మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మున్సిపల్ మేనేజర్ రాకేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్రు నాయక్, మెప్మా TMC జగమంతు, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, భవాని, కవిత, మునిసిపల్ సిబ్బంది నీల రవికుమార్, యాద రమాకాంత్, జవాన్ శరత్, పారిశుధ్య కార్మికులు, వైద్య సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిమిషాంబికా ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు

జయభేరి, మేడిపల్లి :



బోడుప్పల్ నింషాంబిక దేవాలయంలో శ్రావణ శుక్రవారం విశేష పూజలు నిర్వహించి బంగారు వస్త్రంతో అమ్మవారిని అలంకరించామని ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని,ఇది మూడవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా విశేష పూజలు నిర్వహించామని తెలిపారు. వచ్చే శుక్రవారం 56 రకాల స్వీట్ తో మహా నైవేద్య కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

17 వ తేదీ లక్ష గాజుల పూజా కార్యక్రమం ఉంటుంది.చివరి శుక్రవారం 60 సంవత్సరాల ముత్తైదులకు సుమంగళి పూజ,సాయంత్రం మహా మంగళ హారతి కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులతో అష్ట ఐశ్వర్యాలు కలగాలని కోరారు. ప్రతి శుక్రవారం అన్న వితరణ కార్యక్రమం నిర్వహిస్తూ సుమారు 2000 మంది భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మాతా నిమిషాంబిక అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు.




## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 08 :

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. తుర్కపల్లి మండలానికి సబ్సిడీపై బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్స్ 75, పవర్ నాప్ సాక్ స్ప్రేయర్స్ 12, రోటవేటర్స్ 4, సీడ్ కమ్ ఫర్టీ డ్రిల్ల్ 1, ట్రాక్టర్ కి సంబంధించిన పరికరాలు 3, బ్రష్ కట్టర్ 1, పవర్ టిల్లర్ 1 స్ట్రా బెయిలర్ 1, పరికరాలు మంజూరైనవి పెద్ద రైతులకు 40% సబ్సిడీ పై, చిన్న రైతులు, చిన్న సన్నకారు రైతులకి 50% సబ్సిడీ పై వీటిని అందజేయడం జరుగుతుందని అన్నారు. అవసరమైన రైతులు దరఖాస్తు తో పాటు, భూమి పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పరికరాలు అయితే అర్సీ జిరాక్స్ ,పాస్ ఫోటో తీసుకొని రాగలరని కోరారు. ఈనెల 14వ తేదీ వరకు చివరి అవకాశం అని తెలిపారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రతం.. రక్షాబంధన్ వేడుకలు




జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 08 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని పడాల ముత్యాలు మెమోరియల్ హై స్కూల్లో శుక్రవారం సాంస్కృతిక దైనందిన కార్యక్రమాల్లో భాగంగా వరలక్ష్మీ వ్రతం, రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పించడంలో పాఠశాలలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు సామాజిక స్పృహ కు అవసరం అవుతాయని ఇందులో భాగంగా మనమందరం మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భాగ్య, కల్పన, అనూష, నాని, స్వాతి, కల్పన, సునీత, లక్ష్మి, భవాని, రాధిక, రజిత, స్వప్న,శైలజ, సంధ్య, రేవతి, స్వాతి, అరుణ, రాధిక, చిత్ర, సారిక, హసీనా, పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్మన్ జన్మదిన వేడుకలు



జయభేరి, వర్గల్, ఆగస్ట్ 08 :

మండల కేంద్రమైన వర్గల్లో మాజీ ఎంపిపి, ఒంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి డైరెక్టర్ అదాస్ మహేందర్ కాంగ్రెస్ నాయకులు వినోద్, సత్యనారాయణ, నవీన్, బొగ్గుల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి సమీక్షా సమావేశము



జయభేరి, దేవరకొండ :

రాజస్వ మండలాధికారి కార్యాలయము దేవరకొండ నందు ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి సమీక్షా సమావేశము నిర్వహించనైనది ఇట్టి సమావేశములో MLA నేనావత్ బాలు నాయక్ దేవరకొండ , జిల్లా కలెక్టర్, నల్లగొండ రాజస్వ మండలాధికారి దేవరకొండ, PD Housing Nalgonda, దేవరకొండ డివిజన్ తహశీల్దార్స్, MPDO's సంబందిత సిబ్బంది సమీక్షా సమావేశములో పాల్గొన్నారు.

## గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా తీజ్ పండగ



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర గిరిజన దేవరకొండ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా తీజ్ పండగ తెలంగాణ రాష్ట్ర గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలు, బంజారా లంబాడీ సంస్కృత సంప్రదాయానికి చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ ఈ పండుగను డిగ్రీ గిరిజనమహిళా విద్యార్థినులు ఈ శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. తీజ్ బుట్టలను తీసుకుని వచ్చి అందులో మట్టి పోసి విత్తనాలను చల్లారు ఈ తొమ్మిది రోజులు రోజు మూడు పూటలా నీళ్ళని పోసి మొక్కుబడులను చెల్లించారు. విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో ప్రసాదాలను దేవునికి నైవేద్యంగా పెట్టారు. చివరి రోజు 9 వ రోజు తీజ్ బుట్టలను తలపై పెట్టికొని పాటలు పాడుతూ నృత్యాలను చేశారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలియజేశారు. సంప్రదాయం ప్రకారంగా తొమ్మిదవ రోజు తీజ్ బుట్టలను నిమజ్జనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి

- విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్ :**

నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికతో వ్యవహరించాలని విద్యుత్ శాఖ అధికారులకు షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఆయన సమీక్షా నిర్వహించారు. నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల, పోల్స్,వైర్స్ కోసం కొంత మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, అందుకే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని కలిసి పెద్ద ఎత్తున ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ సామాగ్రిని మంజూరు చేయించానని తెలిపారు. ఇప్పుడు మంజూరు అయిన ట్రాన్స్ఫార్మర్, విద్యుత్ సామాగ్రితో వెంటనే సమస్యలు పరిషారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ అయితే రిపేర్ అయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో బిగించడానికి ప్రత్యామ్నాయంగా కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ లను అందుబాటులో ఉంచుకోవాలి తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఏర్పడితే విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి సమస్య పరిష్కరించాలని కోరారు. సమీక్షలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య, విద్యుత్ డీఈ, ఎడిఈ, ఏఈలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్ముడు పోతున్నా.. అధికారులు..!

- పీర్జాదిగూడ టౌన్ ప్లానింగ్ లో టిఎస్ బిపాస్ చట్టాలు ఇక్కడ పనిచేయవు..!?
- అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం
- లక్షల్లో వసూళ్లు.. అటువైపు చూడని అధికారుల కళ్లు..?
- అధికారుల పనితీరు చూస్తే దిమ్మ తిరిగి పోవాల్సిందే..!?
- మత్తు వదలని పీర్జాదిగూడ మున్సిపల్ అధికారులు!



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని బీబీ సాహెబ్ మక్తా అమృత కాలనీలో అక్రమ నిర్మాణాల పండుగ కొనసాగుతోంది. 132 గజాల (G+2) చొప్పున రెండు వేర్వేరు ప్లాట్లకు అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు, నిబంధనలను తుంగలో తొక్కి ఐదు అంతస్తుల ఒకే భవనాన్ని కట్టేస్తున్నాడు. ఇంత బహిరంగంగా జరుగుతున్న అవకతవకలకు కారణం ఏమిటి? మున్సిపల్ అధికారులు ఎందుకు కళ్ళు మూసుకున్నారు? ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయాన్ని దోచేస్తున్న ఈ అక్రమ నిర్మాణం వెనక ఎవరున్నారు? ఖద్దరు నేతల సహకారం లేకుండా ఇంత పెద్ద నిర్మాణం నిర్మించె దమ్ము వస్తుందా? ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టి, కొందరి జేబులు నింపడానికి అధికార యంత్రాంగం మౌనంగా కూర్చోవడం అంటే ఇదేనా..? ఐతే ఇంతగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై పీర్జాదిగూడ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారికి మాత్రం కనిపించడం లేదంటే మహా విడ్డూరంగా ఉంది కదా...! అసలు కమిషనర్ దృష్టికి ఈ విషయం వెళ్లిందో లేదో తెలియదు కానీ, ఇప్పటికైనా దీనిని పరిగణలోకి తీసుకొని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు బాహాటంగానే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## నిండిన జంట జలాశయాలు

**జయభేరి, హైదరాబాద్ :**

గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు జంట జలాశయాలు నిండుకుండలా మారాయి. హిమాయత్ సాగర్ ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద మీరు హిమాయత్ సాగర్ కు పోటెత్తుతుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయికి చేరిన నీటి మట్టం 1764 చేరింది. నాలుగు గేట్లు ఎత్తి 1,400 క్యూసెక్కుల నీటిని అధికారులు మూసిలోకి వదులుతున్నారు. గురువారం రాత్రి ఒక గేట్ ఎత్తారు. హిమాయత్ సాగర్ కి మరింత వరద నీళ్లు పెరగడంతో శుక్రవారం ఉదయం మరో మూడు గేట్లు ఎత్తివేసారు. హిమాయత్ సాగర్ ఎఫ్టీఎల్ 1764 ఫీట్లు కాగా ప్రస్తుతం 1763.10 ఫీట్లు మెయింటెన్ చేస్తున్నారు. హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో మూసీ పరివాహక ప్రాంతాలకు అలెర్ట్ జారీ చేసారు. మరో రెండు గేట్లు ఎత్తితే మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని ఖాళీచేయిస్తామని అంటున్నారు.

# ఇసుక లారీల దుమ్ముపై నివారణ చర్యలు తీసుకోవాలి

- తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన సిపిఎం శ్రేణులు

**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 8 :**

వెంకటాపురం మండలంలో ఇసుక లారీల వల్ల లేస్తున్న దుమ్ము ధూళి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం శ్రేణులు గురువారం తహసిల్దార్ ఎం వేణుగోపాలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ వెంకటాపురం మండలంలో ప్రస్తుతం నడుస్తున్న ఏడు ఇసుక ర్యాంపులతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇసుక ర్యాంపులకు సంబంధించిన లారీలు మండల కేంద్రం మీదుగా రవాణా జరుగుతోందని దీంతో వేలాది ఇసుక లారీలు లేపుతున్న దుమ్ము ధూళి కారణంగా ప్రధానంగా కూరగాయలు తినుబండారాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము ధూళితో షాపులలో వస్తువులు పాడవుతున్నాయని వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. నిత్యం మండల కేంద్రంలో వేలాది మంది ప్రజలు తమ అవసరాల కోసం వ్యాపార నిమిత్తం వస్తూ ఉంటారని లారీలు లేపుతున్న దుమ్ము ధూళి పీల్చడం ద్వారా ఊపిరితిత్తులు ఇతర అనారోగ్యాల సమస్యలకు గురికావాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల, వ్యాపారస్తుల ఆరోగ్యాలను కాపాడాలని ప్రభుత్వానికి విన్నవించారు. మండల కేంద్రంలో దుమ్ము లేవకుండా దుమ్ము నియంత్రణ మిషన్ ద్వారా దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపుల వద్ద ఇసుక లారీలకు పార్కింగ్ స్థలాలను కేటాయించి తద్వారా ట్రాఫిక్ సమస్యను నివారించాలని కోరారు. ప్రతిరోజు ఇసుకరాంపులలో 80 లారీలకు లోడింగ్ పరిమితి ఇచ్చేలా ఉన్నత అధికారులు కృషి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు చిట్టెం ఆదినారాయణ, గుండమల్ల ప్రసాద్, ఇర్ప శ్రీను, కోగిల మాణిక్యం, తోట నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



## శుక్రవారం ప్రత్యేక పూజలు

**దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, పరమ పంచముఖ స్పటిక శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించినారు. శ్రావణ మాసంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తులసి దళాలతో అర్చనతులసి దళాలతో మహిళల ప్రత్యేక పూజలు నిర్వహించినారు పూజలో పాల్గొన్న మహిళలకు డ్రా ద్వారా ఇద్దరికీ ఆకర్షనీయమైన బహుమతులు ఇచ్చినారు. బహుమతుల దాత శీలా మధు శోభారాణి సాయి లక్ష్మి జువెలరీస్ దేవరకొండ తులసి అనేది ఒక పవిత్రమైన మరియు ఔషధ గుణాలు కలిగిన మొక్క. దీనిని తులసి మాతగా భావిస్తారు మరియు లక్ష్మీదేవి అవతారంగా పరిగణిస్తారు. ప్రత్యేకించి శ్రీ వైష్ణవ సంప్రదాయంలో తులసి మొక్క పట్ల ఎంతో భక్తి పూజా విధానాలు ఉన్నాయి. ఆడవారు తమ పసుపు కుంకుమలు పదిలంగా ఉండడానికి తులసిని పూజిస్తారు. తులసి తీర్థం లేదా తులసి రసం భారతీయ సంప్రదాయంలో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంది, దీనిని సర్వరోగ నివారిణిగా భావిస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం మనిషి చనిపోయే ముందు నోట్లో తులసి తీర్థం పోస్తారు.
వైకుంఠానికి చేరుకుంటారని భావిస్తారు. తులసి మొక్క ఉన్నచోట త్రిమూర్తులు మొదలగు సర్వదేవతలు నివసిస్తారు అని ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ వారి శిష్య బృందం తెలియపరిచినారు. ఈ కార్యక్రమంలో ఆలయం గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు, సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





## అక్క చెల్లెలు అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజకవర్గం సోదరీమణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. ఈ పవిత్ర రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని, దేవరకొండ నియోజకవర్గంలోని సమస్త సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. బంధుత్వానికి, ప్రేమకు, రక్షణకు ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి నింపాలని ఆకాంక్షిస్తున్నాను. సోదర-సోదరీమణుల మధ్య అనుబంధం మరింత బలపడాలని ఆశిస్తున్నాను. మహిళల రక్షణకు, ఆత్మగౌరవానికి, అభివృద్ధికి నా సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మీ అందరి సేవలో నిత్యం సిద్ధంగా ఉన్నాను. వడ్త్య దేవేందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అని తెలియజేసినారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పెన్నులు నోట్ పుస్తకాలు పంపిణీ

**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 8 :**

ఖమ్మం గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలల లోని బర్లగూడెం, ఒంటిమామిడి, మైతపురం, నూగూరు, రాచపల్లి, తిప్పపురం, కలిపాక ,కొత్త గుంపు, సూరవీడు కొత్త కాలనీ, సూరవీడు, అంకన్నగూడెం, నాయకులగూడెం గ్రామాలలోనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారు 400 మంది నిరు పేద విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పెన్నులు, నోట్ పుస్తకాలు,పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన నాయకులగూడెం ప్రధానోపాధ్యాయులు పి సూర్య నారాయణ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం చాలా సంతోషకరమని ఇటువంటి సహాయాన్ని అందిస్తున్నటువంటి గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మారుమూల గిరిజన గ్రామాలలో పేద పిల్లలకు సహాయం చేయడానికి ఇటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావడం చాలా అభినందనీయమనీ, సంస్థ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సిబ్బంది జి.యస్.యస్ ప్రతినిధులు ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య, ఉపాధ్యాయురాలు కారం ఇందిరా, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## సీఎస్ ను కలిసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

**జయభేరి, ఉప్పల్ :**

సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావును కలిసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు. తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తరఫున, స్వయంగా తన తరఫున రెండు విజ్ఞాపన పత్రాలు సీఎస్ కు అందజేసిన హరీష్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదిక ప్రతులను తమకు అందజేయాల్సిందిగా సీఎస్ రామకృష్ణా రావును కోరిన ఎమ్మెల్యే హరీష్ రావు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి.



## సృష్టి కేసులో తీగ లాగితే డొంక కదులుతుంది..!

**జయభేరి, హైదరాబాద్:**

సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తుంది, ఇప్పటికే ఈ కేసులో అరెస్టు అయిన వారి సంఖ్య 24 కు చేరింది, పోలీసులు దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు విచారణలో భాగంగా అక్రమాల సృష్టికి కారకురాలైన ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత నుంచి తాజాగా కీలక విషయాలు రాబట్టారు.
వైద్య వర్గాల్లో సృష్టి, ఫెర్టిలిటీ కేసు మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు వేగం పెంచింది. తాజాగా ఈ కేసులో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ కేజీహెచ్,కు చెందిన ఇద్దరు వైద్యులను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి కుమార్, ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి ఉన్నారు. ఇక వాసుపల్లి రవి కుమార్ మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కావడంతో ఈ కేసులో మరో రాజకీయ కోణాన్ని తీసుకరాబోతుంది. ఇదివరకు ఇదే కేసులో అరెస్టయి, బెయిల్ పై విడుదలైన డాక్టర్ విద్యాలత కూడా కేజీహెచ్ పిల్లల విభాగంలో పనిచేశారు. ఈ వైద్యులు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే 'సృష్టి' ఫెర్టిలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారని ఆరోపణలు ఉన్నాయి. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఈ అరెస్టులపై తనకు వివరాలు తెలియవని తెలిపారు. డాక్టర్ వాసుపల్లి రవి కుమార్ గత మూడు రోజులుగా సెలవులో ఉన్నట్లు సమాచారం. ఇక మరో వైపు, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు ఈ కేసులో అరెస్ట్ అయిన వారి సంఖ్య 28కి చేరింది. దర్యాప్తులో బయటపడ్డ వివరాల ప్రకారం, సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత ఇప్పటి వరకు సుమారు 50 మంది బాధితుల వద్ద నుంచి రూ.20 కోట్లకు పైగా వసూలు చేశారు. మరో కీలక నిందితురాలు సంతోషి ఏజెంట్ల ద్వారా 18 మంది శిశువులను సేకరించినట్లు తేలింది.
ముఖ్యంగా గిరిజన మహిళలను ప్రలోభపెట్టి వారి నుంచి శిశువులను రూ.5 లక్షలకు కొనుగోలు చేసి, తమ క్లయింట్లకు ఒక్కో శిశువును రూ.50 లక్షలకు విక్రయించినట్లు వెల్లడైంది. మొత్తం 80 మంది పిల్లలను అమ్మిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. తల్లులను గుర్తించి శిశువులను తిరిగి వారికి అప్పగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



# కల్ట్ క్లాసిక్ శివ రీరిలీజ్.. డబుల్ ట్రీట్ ప్లాన్ చేసిన మేకర్స్

అక్కినేని నాగార్జున కెరీర్‌లో నిలిచిపోయే కల్ట్ క్లాసిక్ మూవీ 'శివ'. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 1989లో విడుదలై, తెలుగు సినిమా రంగానికి సరికొత్త దిశ చూపించింది. అప్పటి వరకూ ఒకే తరహా ఫార్ములా సినిమాలతో కొనసాగుతున్న టాలీవుడ్‌కు కొత్త శకాన్ని తెచ్చింది. అందుకే తెలుగు సినీ చరిత్రలో 'శివ'కు ముందు, 'శివ' తర్వాత అనే భావన ప్రబలంగా ఉంటుంది. ఇప్పుడు ఆ సంచలన చిత్రం మళ్లీ తెరపైకి రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని 'శివ'ను 4K డాల్బీ అట్మాస్ సౌండ్‌తో రీరిలీజ్ చేయనున్నట్లు నాగార్జున అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ స్పెషల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. "హలో మై ఫ్రెండ్స్! మోస్ట్ ఐకానిక్ మూవీ 'శివ'ని తిరిగి తెరపైకి తీసుకువస్తున్నాం. 4K డాల్బీ అట్మాస్ సౌండ్‌తో విడుదల చేస్తాం. త్వరలో మీ ముందుకు రానుంది. ఆగస్టు 14 నుంచి కూలీ సినిమా ప్రదర్శించే థియేటర్స్‌లో శివ ట్రైలర్‌ని కూడా ప్రదర్శించనున్నారు అని చెప్పుకొచ్చాడు. శివ సినిమా రీరిలీజ్ కాబోతుందనే శుభవార్తతో పాటు.. కూలీ సినిమా థియేటర్ లోనే శివ 4కె ట్రైలర్ ను రిలీజ్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ఇప్పటి టెక్నాలజీకి తగ్గట్లు 4K డాల్బీ అట్మోస్ సౌండ్ తో ఈ ట్రైలర్ ఉండబోతుండగా, ఈ ట్రైలర్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడు అనేది మాత్రం ఇంకా ప్రకటించలేదు. రామ్ గోపాల్ వర్మ ఈ రీరిలీజ్‌పై స్పందిస్తూ,"చైన్ ఈజ్ బ్యాక్! ఈసారి డాల్బీ అట్మాస్‌లో నాగార్జున పంచ్ మరింత బిగ్గరగా వినిపిస్తుంది. మీ దవడను కాపాడుకోండి!" అంటూ ట్వీట్ చేశారు.దీనికి నాగార్జున స్పందిస్తూ,"ఇది నీ శివ, మై డియర్ ఫ్రెండ్."అని రిప్లై ఇవ్వగా, వర్మ "నువ్వు శివగా లేకపోతే ఎప్పటికీ నా శివ పుట్టేది కాదు అని స్పందించారు. రీరిలీజ్ కోసం ఫ్యాన్స్ ఎంతకాలంగా ఎదురుచూస్తున్నారో తెలిసిందే. రీరిలీజ్ ట్రెండ్ ఊపందుకున్నప్పటి నుంచీ 'శివ' 4K వెర్షన్ రావాలంటూ సోషల్ మీడియాలో నిరంతరం డిమాండ్స్ కొనసాగుతూనే ఉన్నాయి. చివరకు అభిమానుల ఆకాంక్షలు నెరవేరబోతున్నాయి. ఈ చిత్రంలో నాగార్జున సరసన అమల హీరోయిన్‌గా నటించగా, రఘువరన్ ప్రతినాయకుడిగా మెప్పించారు. జేడీ చక్రవర్తి, తనికెళ్ల భరణి, చిన్నా, శుభలేఖ సుధాకర్, నగేష్ లాంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటించారు. ఇళయరాజా సంగీతం అందించగా, ఎస్. గోపాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ నిర్వహించారు.36 ఏళ్ల తర్వాత 'శివ' మళ్లీ థియేటర్లలోకి రానుండడం సినీ ప్రేమికులకు పండగే.

# ఉండిపోవే నాతోనే..



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా రూపొందుతున్న హారర్ మిస్టరీ థ్రిల్లర్ 'కిష్కిందపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. సాహు గారపాటి నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలోని తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఉండిపోవే నాతోనే..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా, చైతన్య భరద్వాజ్ స్వరపరిచారు. జావేద అలీ ఆలపించారు.

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్‌ల కెమిస్ట్రీ ఈ పాటలో అద్భుతంగా ఉంటుందని, ప్రేమలోని భావోద్వేగాలను ఆవిష్కరించేలా ఈ పాట సాగిందని, అందమైన బీచ్ సైడ్ విజువల్స్ చాలా ప్లెజెంట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. రాజుసుందరం కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుందని కూడా తెలియజేవారు. హారర్ మిస్టరీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా అన్ని వయసుల వారికీ నచ్చుతుందని హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ తెలిపారు. ఇంకా దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి, అనుమప పరమేశ్వరన్, సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ తదితరులు కూడా మాట్లాడారు.



నెగటివిటీ సర్వత్రా ఉంటుంది. కానీ మనం ఫోకస్ చేయాల్సింది దేని మీదో మనకో క్లారిటీ ఉండాలంటున్నారు రష్మిక మందన్న. వృత్తి పరంగా తీరిక లేకుండా ఉన్నానన్నారు. ప్రయాణంపై దృష్టి పెట్టినప్పుడు, పక్క చూపులు ఉండవన్నది నేషనల్ క్రష్ చెబుతున్న మాట. సాటి మనుషుల పట్ల దయతో ప్రవర్తించినప్పుడు మన చుట్టూ పాజిటివిటీ ఉంటుందన్నారు మిస్ మందన్న. సాటి మనుషుల్ని కాస్త ఊపిరి పీల్చుకోనిద్దాం. మనం ఎదగడం కోసం పక్కవాళ్ల గొంతు నొక్కక్కర్లేదన్నారు ఈ బ్యూటీ. ఈ ప్రపంచం చాలా పెద్దది.. మనందరికీ స్థలం ఉందన్నది రష్మిక నమ్మే సిద్ధాంతం. బేసిగ్గా రష్మిక చాలా ఎమోషనల్ పర్సన్ అట. ఆమె చుట్టూ ఉన్నవాళ్లకి ఈ విషయం బాగా తెలుసట. అంత రియల్‌గా ఉంటారు కాబట్టే, అందరూ ఆమెని జాగ్రత్తగా ప్రొటెక్ట్ చేస్తుంటారట. సేమ్ టైమ్ తనలోని భావోద్వేగాలను జనాల ముందు పెద్దగా ప్రదర్శించడానికి ఇష్టపడరట రష్మిక. నటిగా సొసైటీలోకి వచ్చాక తన రియల్ ఎమోషన్స్ ని కూడా చాలా మంది ఫేక్ అనుకునే ప్రమాదం ఉందని, దాన్ని తన బలహీనతగా ఎవరూ చూడకూడదని.. అందుకే కొన్నిసార్లు గోప్యత తప్పదని అన్నారు రష్మిక.

# సెగలు పుట్టిస్తోన్న సైతాన్..



సినీరంగంలోకి ఇప్పుడిప్పుడే కొత్త కొత్త హీరోయిన్స్ ఎంట్రీ ఇస్తున్నారు. ఒక్క సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. చూపు తిప్పుకోనివ్వని అందంతోపాటు తమ నటనతో సినిమా ప్రపంచంలో తమదైన ముద్ర వేస్తున్నారు. తక్కువ సమయంలోనే తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటున్నారు. అటు సినిమాలు.. ఇటు వెబ్ సిరీస్ లతో ఇండస్ట్రీలో బిజీగా ఉంటున్నారు. అలాంటి వారిలో ఈ హీరోయిన్ ఒకరు. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్న హీరోయిన్. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించిన ఆమె.. ఆ తర్వాత ప్రధాన పాత్రలు పోషించింది. ఇటీవల సూపర్ హిట్ అయిన సైతాన్ వెబ్ సిరీస్ ద్వారా మరింత పాపులర్ అయ్యింది. మహి. వి. రాఘవన్ ఈ వెబ్ సిరీస్ కు దర్శకత్వం వహించగా.. ఇందులో దేవయాని శర్మ కీలకపాత్ర పోషించింది. భానుమతి అండ్ రామకృష్ణ అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఇప్పుడిప్పుడే మెప్పిస్తుంది. ఆకాష్ పూరి నటించిన రొమాంటిక్ సినిమాలో హీరో స్నేహితురాలిగా కనిపించింది. ఈ సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత సైతాన్ వెబ్ సిరీస్ ద్వారా మరింత పాపులర్ అయ్యింది. 2023లో వచ్చిన సేవ్ ది టైగర్స్ సిరీస్ దేవయానికి జనాలకు దగ్గర చేసింది. అదే ఏడాది వచ్చిన సైతాన్ సిరీస్ మాత్రం ఆమె కెరీర్ మలుపు తిప్పింది. ఇందులో తన నటనతో ఆకట్టుకుంది. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు హిందీలో లవ్ శుదా అనే చిత్రంలో కనిపించింది. తెలుగులో ఇప్పుడిప్పుడే పలు సినిమాలు, వెబ్ సిరీస్ చేస్తుంది. మరోవైపు సోషల్ మీడియాలో నిత్యం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేసుంది.

# ఎన్టీఆర్ అభిమానులకి గుడ్ న్యూస్.. వార్ 2 కోసం భారీ ఈవెంట్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ హృతిక్ రోషన్ కలయికలో వస్తున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'వార్ 2' విడుదలకు ఇంకో ఆరు రోజులు సమయం మాత్రమే మిగిలి ఉంది. వార్ 2 చిత్రం తారక్ నటిస్తున్న తొలి హిందీ చిత్రం కావడంతో తెలుగు ప్రేక్షకుల్లో ఈ మూవీపై భారీ స్థాయిలో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్స్ సినిమాపై అంచనాలు మరింత పెంచాయి. అయితే సినిమా రిలీజ్ దాదాపు దగ్గరపడినప్పటికీ, ఒక్క పెద్ద ప్రమోషనల్ ఈవెంట్ కూడా జరగకపోవడంతో అభిమానులు కాస్త నిరాశ వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ లోటు భర్తీ చేయబోతున్నారు మేకర్స్.

తాజాగా మేకర్స్ అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం, ఆగస్టు 10న హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్ వేదికగా 'వార్ 2' గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుంది."ది మ్యాన్ ఆఫ్ మాసెస్, ది గ్రీక్ గాడ్, ఒక ఎపిక్ నైట్ కోసం మీ క్యాలెండర్‌లో డేట్‌ని మార్క్ చేసి పెట్టుకోండి అని ఉత్సాహంగా ప్రకటించారు.

దీంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇక ఈ ప్రమోషనల్ ఈవెంట్ విజయవాడలో జరగనుందన్న వార్తలు గతకొన్ని రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టినా, చిత్రబృందం వాటిని ఖండించింది. చివరకు హైదరాబాద్‌లోనే ఈ గ్రాండ్ ఈవెంట్ జరపాలని భావించి అఫీషియల్ ప్రకటన విడుదల చేసింది.

యశ్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం, స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందగా, ఈ చిత్రం 'వార్' మూవీకి సీక్వెల్‌గా వస్తుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తారక్, హృతిక్ రోషన్ కలిసి నటించడం, యాక్షన్ ఎపిసోడ్స్‌లో వీరిద్దరి మధ్య వచ్చే యాక్షన్ సీన్స్ సినిమాపై బజ్‌ను పెంచింది. ఆగస్టు 14న 'వార్ 2'తో పాటుగా లోకేష్ కనగరాజ్ డైరెక్షన్‌లో వచ్చిన 'కూలీ' మూవీ కూడా విడుదల అవుతోంది. ఈ భారీ మల్టీ స్టారర్‌లో రజనీకాంత్,నాగార్జున,ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ తదితరులు నటిస్తున్నారు. ఈ ఇండిపెండెన్స్ వీక్‌కి బాక్సాఫీస్ పైచేయి ఎవరు సాధిస్తారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889**. **RNI No: TGTEL/25/A0314**. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com